

జాతీయ పతాకానికి వందనం చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

- దేశభక్తిని నింపిన సాయుధ బలగాల కవాతు
- జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న అధికారులకు అభినందనలు
- ప్రజల జీవన విధానాన్ని మార్చడానికి ప్రభుత్వం కృషి
- జిల్లాలో 42,903 బంగారు కుటుంబాలు గుర్తింపు
- ఆశాజనకంగా నిండిన రిజర్వాయర్లు
- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు
- జాతీయ జెండా ఎగురవేత

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం అందించిన ఎందరో అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల ప్రభుత్వ కళాశాల మైదానంలో 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనాన్ని స్వీకరించారు. సాయుధ బలగాల కవాతు ప్రతిఒక్కరిలో దేశభక్తిని నింపింది. మంత్రి మాట్లాడుతూ మువ్వన్నెల జెండా ఒక ఉద్వేగం.. ఓ స్ఫూర్తి అన్నారు. త్రివర్ణ పతకాన్ని మన తెలుగువారు రూపొందించడం మనందరికీ గర్వ కారణమన్నారు. కుల, మత, ప్రాంతాలకతీతంగా ప్రజలంతా ఒకే గొడుకు కిందకు రావాలని పిలుపునిచ్చారు. మహోన్నత వ్యక్తుల త్యాగాలను అందరూ గుర్తు పెట్టుకోవాలని, స్వాతంత్ర్య పోరాటాన్ని యువత తెలుసుకోవాలన్నారు. నంద్యాల జిల్లాలో పుట్టి పెరిగి మన ప్రాంత ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గోసాయి వెంకన్న, వడ్డె ఓబన్న, నంద్యాల ఖాదరబాద్ నరసింగరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, స్వామిరెడ్డి, పెండేకంటి వెంకటసుబ్బయ్య, బీవీ సుబ్బారెడ్డి, గుర్రం వెంకటరెడ్డి లాంటి మహనీయుల ఆశయాలను, లక్ష్యాలను స్వీకరించి వారి స్ఫూర్తిని అనుసరించాలన్నారు. జిల్లాను అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న కలెక్టర్ రాజకుమారితో పాటు అన్నిశాఖల అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా వ్యవహరించి జిల్లాను రాష్ట్రంలోనే అగ్ర గామిగా నిలబెట్టాలని ఆకాంక్షించారు. గత ఏడాది కాలంలో సీఎం నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమంతో కూడిన సుపరిపాలన అందించారని కొనియాడారు. ప్రజల జీవన విధానాన్ని మార్చడానికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందన్నారు. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమంతో పాటు కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. స్వర్ణాంధ్ర 2047లక్ష్యంతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా సీఎం కృషిచేస్తున్నారన్నారు. అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం ఇవ్వడమే లక్ష్యంగా పేదరిక నిర్మూలన, ఉపాధికల్పన, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికి తాగునీరు వంటి సమగ్ర విధానాలతో ముందుకు వెళ్తున్నామన్నారు. టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. మనమిత్ర వ్యాట్సప్ పేరుతో సెల్‌ఫోన్ ద్వారా పౌర సేవలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా పీ-4 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టామన్నారు. జిల్లాలో నేటి వరకు 42,903 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని రాష్ట్రంలో అమలు చేయడానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. 8,456 బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ఏర్పాటు చేశామన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన 'అన్నదాత సుఖీభవ' ద్వారా ఏడాదికి రూ.20 వేలను అర్హులైన రైతులకు అందిస్తున్నామన్నారు. మొదటి విడతగా రూ.140 కోట్లను రైతు ఖాతాల్లో జమ చేశామని అన్నారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో రూ.9,960కోట్ల ఆర్థిక లక్ష్యానికి గాను నేటివరకు రూ.4570 కోట్ల పంట రుణాలను బ్యాంకుల ద్వారా రైతులకు అందించామన్నారు. కౌలు రైతుల సంక్షేమం కోసం 12,795 పంట సాగు హక్కు పత్రాలను జారీచేశామన్నారు. ఆరువేల మంది కౌలు రైతులను రుణాలను అందిచామన్నారు. జిల్లాలో సాధారణ వర్షపాతం ఆగస్టు వరకు 279.0 మి.మీ కాగా నేటి వరకు 293.5మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ఆశాజనకంగా రిజర్వాయర్లు నిండాయన్నారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలో హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుందన్నారు. చివరి భూములకు నీరందించా లనే సంకల్పం నెరవేరుతోందన్నారు. జిల్లాలో 5.95లక్షల ఎకరాలకు గాను నేటి వరకు 3.74లక్షల ఎకరాల్లో పంట సాగు జరుగుతోందన్నారు. డిజిటల్ నమోదు ద్వారా సం క్షేమ పథకాలు ప్రతిఒక్క రైతుకు లబ్ధి చేకూరుతోందన్నారు. 27కేజీబీవీల్లో విద్యార్థినులకు అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. ఇలా ప్రతిశాఖ కూడా అభివృద్ధి పథంలో సాగుతోందన్నారు. నూతనంగా ఏర్పడిన నంద్యాల జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


పోలీసుల మార్చ్‌ఫాస్ట్


ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కుటుంబ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డికి సత్కారం


పాల్గొన్న అధికారులు


కేజీబీవీ విద్యార్థినుల నృత్యం


రెండో బహుమతి పొందిన మున్సిపాలిటీ ప్రగతి శకటం


ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది మార్చ్‌ఫాస్ట్


ప్రథమ బహుమతి పొందిన హార్టికల్చర్ ప్రగతి శకటం


దేశభక్తిని చాటేలా శక్తి టీమ్


పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

నంద్యాల కల్చరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. వీటిలో హార్టికల్చరల్, మున్సిపాలిటీ, స్త్రీశక్తి శకటాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి. పలు పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

జడ్పీలో కారుణ్య నియామకాలు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకం కింద కొందరికి శుక్రవారం జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈవో జి.నాసరరెడ్డి జడ్పీ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. నాల్గవ తరగతి ఉద్యోగులకు, రికార్డు, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లకు పదోన్నతులు సైతం కల్పించారు. సీనియర్ అసిస్టెంట్ కౌసల్యకు పరిపాలన అధికారిగా, ఐదు మంది రికార్డు అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుకుగా, కారుణ్య నియామకం కింద 6 మందికి, 28 మంది నాలుగో తరగతి ఉద్యోగులకు రికార్డు, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు.

అవార్డు ప్రదానం


సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ ఫ్లోరమ్మ

పాణ్యం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు పాణ్యం మండలంలోని ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్లోరమ్మ ఉత్తమ రాష్ట్ర గురుకుల పాఠశాల అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ మాధవి, టీడీపీ నాయకులు శివశంకరరెడ్డి, మాజీ ఎంపీపీ ఆదిశేషారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజలు ఆమెకు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

- ఆళ్లగడ్డ సమీపంలో ఢీకొన్న రెండు ప్రైవేటు బస్సులు
- 27 మంది ప్రయాణికులకు గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

7లో

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

- ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు


నంద్యాలలో ప్రారంభిస్తున్న మంత్రి బీసీ, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం శుక్రవారం ప్రారంభమైంది. ఈ పథకాన్ని జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఆర్టీసీ ఆర్ఎం రజియా సుల్తానా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫరూక్ హాజరై ప్రారంభించారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఆర్డీవో నాగజ్యోతి కూటమి నాయకులు చేతులు మీదుగా ప్రారంభించారు. నంది కొట్కూరు బస్టాండ్‌లో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు జెండా ఊపీ ప్రారంభించి మహిళలకు జాకెట్‌లను పంపిణీ చేశారు. డోన్‌లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ప్రారంభించి మహిళలతో కలిసి ప్రయాణం చేశారు. ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రారంభించారు. ఇదిలా ఉండగా.. జిల్లాలో పలు ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించడంతో ఆర్టీసీ ప్రాంగణాలు మహిళలతో నిండిపోయింది. ఎంతో ఉత్సాహంగా మహిళలు, ప్రజాప్రతినిధులతో ఆర్టీసీ బస్టాండ్‌లో సందడిగా మారింది.


ఆళ్లగడ్డలో కండక్టర్ వద్ద జీరో టికెట్‌ను తీసుకుంటున్న ఎమ్మెల్యే భూమ అఖిల ప్రియ


డోన్‌లో జీరో టికెట్ ఇస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

శ్రీశైలం పీహెచ్‌సీ వైద్యాధికారి సస్పెన్షన్

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం పీహెచ్‌సీ వైద్యాధికారి షహనాజ్‌ను సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కె.పద్మావతి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఇటీవల శ్రీశైలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించిన సందర్భంగా కూడా డా.షహనాజ్ విధులకు హాజరు కాలేదని ఆయన తెలిపారు. అంతేకాకుండా రోగులకు అందుబాటులో లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

అవినీతిని అరికట్టడానికి కృషి

- రాష్ట్ర ఉప లోకాయుక్త రజిని

కర్నూలు లీగల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల్లో అవినీతిని, అలసత్వాన్ని, అధికార దుర్వినియోగాన్ని అరికట్టడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ఉప లోకాయుక్త రజిని అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లోకాయుక్త కార్యాలయంలో జాతీయ జెండాను ఆమె ఎగురవేశారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి లోకాయుక్త కృషి చేస్తుందన్నారు. ప్రజలు తమ హక్కులను కాపాడుకోవడానికి లోకాయుక్తను ఆశ్రయిస్తే విచారించి న్యాయం అందిస్తుందన్నారు.


లోకాయుక్త కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న రాష్ట్ర ఉప లోకాయుక్త రజిని

అండర్-13 బ్యాడ్మింటన్‌లో నెంబర్‌వన్ ర్యాంకు

- జాతీయ స్థాయి ర్యాంకింగ్ టోర్నీలో జశ్వంత్ ప్రతిభ



నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో ఈ నెల 9నుంచి 14వరకు జరిగిన ఆలిండియా సబ్ జూనియర్ జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన మహంకాళి జశ్వంత్ అండర్-13 విభాగంలో అద్భుతంగా ఆడి స్వర్ణపతకం సాధించాడు. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ పోటీలో హర్యానా రాష్ట్రానికి చెందిన స్లోక్ చౌదరి రాయ్‌పై 19-21, 21-19, 21-16 స్కోర్ తేడాతో మహంకాళి జశ్వంత్ గెలుపొందాడు. అంతేకాకుండా ఆలిండియా నెంబర్‌వన్ ర్యాంక్ సాధించాడు. జశ్వంత్‌కు బంగారు పతకం, ట్రోఫీతో పాటు రూ.72 వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. పశ్చిమ బెంగాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. జశ్వంత్ విజయంపై ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ద్వారకానాథ్, కార్యదర్శి అంకమ్మ చౌదరి, జిల్లా కార్యదర్శి వంశీధర్, నంది బ్యాడ్మింటన్ శిక్షకుడు నాగార్జున తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



మంత్రి టీజీ భరత్‌తో ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఆర్వో వెంకటనారాయణమ్మ

- కర్నూలు జిల్లాలో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, పోలీసులులకు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా ప్రశంసాపత్రాలు అందజేశారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఉద్యోగులను అభినందించారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జేసీ నవ్య పాల్గొన్నారు.
- నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకలకు రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణుచరన్ హాజరయ్యారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు, పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఆర్వో రామునాయక్

కర్నూలు జిల్లా...



కిదారి సందీప్‌కుమార్ ఆర్డీవో, కర్నూలు | కె.వేణుగోపాల్ సెట్కూర్ సీఈవో | జి.నాసరరెడ్డి జడ్పీ సీఈవో | హిమప్రభాకర్ రాజు, సీపీవో | శ్యామ్యూల్ పాల్, డీఈవో | శాంతికళ డీఎంహెచ్‌వో | ఎస్.రాజారఘువీర్ డీఎస్‌వో | సుధీర్‌బాబు ఎక్సైజ్

తులసీదేవి సోషల్ వెల్ఫేర్ | రమణారెడ్డి డీఆర్‌డీవో | చిరంజీవి హౌసింగ్ పీడీ | నాగేశ్వరరావు ఆర్‌డబ్ల్యూఎస్ | డా.సుధాకర్‌రావు కంటి వైద్యుడు | శివరాముడు కలెక్టరేట్ ఏవో | గోవింద్‌సింగ్ కలెక్టరేట్ | వెంకటేశ్వర్లు డీఆర్వో సీసీ

సాయిఉదయ్‌రెడ్డి కలెక్టరేట్ | కుమార్‌నాథ్ కలెక్టరేట్ | వి.ప్రవీణ్‌కుమార్ కలెక్టర్ సీసీ | జయన్న కలెక్టరేట్ | రమేష్‌బాబు తహసీల్దారు | బాబు ప్రసాద్ డీఎస్పీ, కర్నూలు | వెంకట్రామయ్య డీఎస్పీ, పత్తికొండ | నాగరాజారావు, సీఐ టూటౌన్, కర్నూలు

శేషయ్య, సీఐ త్రీటౌన్, కర్నూలు | చంద్రబాబు నాయుడు రూరల్ సీఐ, కర్నూలు | దిలీప్ కుమార్ ఎస్ఐ, హొళగుంద | తిప్పన్న, కేఎంసీ | ఈరకుమార్ కేఎంసీ | మహ్మద్ హుస్సేన్, కేఎంసీ | కుమార్, కేఎంసీ | ఓబులేసు, ట్రాన్స్‌కో

సైరాబాను 'కుడా' | రాంసింగ్ నాయక్, 'కుడా' | భారతి ఏడీసీపీవో | ఎస్.మధులత డిప్యూటీ ఎంపీడీవో, గూడూరు | గంగాధర్ ఏవో, డీఎల్‌పీవో, కర్నూలు | జహీరా ఫాతిమా వాణిజ్యపన్నుల శాఖ | డేనియల్ పరిశ్రమలు | రామేశ్వరరెడ్డి తహసీల్దార్, ఆస్పరి

నంద్యాల జిల్లా...



యుగంధర్‌బాబు, ఏఎస్పీ | జనార్దన్‌రెడ్డి, డీఈవో | లీలావతి, పీడీ, ఐసీడీఎస్ | చల్లా విశ్వనాథ్, ఆర్డీవో, నంద్యాల | నరసింహులు, ఆర్డీవో, డోన్ | నాగజ్యోతి, ఆర్డీవో, ఆత్మకూరు | సత్యనారాయణ, పీడీ, డీఆర్‌డీఏ | నరసింహారావు, ఏవో, కలెక్టరేట్

నాగరాజు, జిల్లా ఉద్యానశాఖ అధికారి | సూర్యనారాయణ డ్వామా పీడీ | నాగరాజు, డీపీఈఆర్వో | సుధాకర్‌కుమార్, ఎస్ఈ, ఏపీఎస్‌పీడీసీఎల్ | గోవిందనాయక్, పశుసంవర్ధకశాఖ | నరసింహారెడ్డి, డీఎల్‌డీవో | సౌజన్య, డీటీ(కలెక్టరేట్) | శారద, ఏవో వ్యవసాయశాఖ

కవిత, ఏఈవో | నాగమునీశ్వరమ్మ, డీఎఫ్‌వో | జయరామ్, సీఐ, దిశ, నంద్యాల | ప్రవీణ్‌కుమార్, సీఐ, బనగానపల్లె | సుబ్రహ్మణ్యం, సీఐ, నందికొట్కూరు రూరల్ | సూర్యమౌలి, సీఐ, ఎస్‌బీ | కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఐ, పాణ్యం | రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐ మహానంది





సురేష్, ఎస్ఐ | శ్రీనివాసులు, ఎస్ఐ | ఆంజనేయులు ఫొటోగ్రాఫర్, ఐఅండ్‌పీఆర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

- ఆళ్లగడ్డ సమీపంలో ఢీకొన్న రెండు ప్రైవేటు బస్సులు
- 27 మంది ప్రయాణికులకు గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం



మృతి చెందిన కుసరాజు,వెంకటసాయి, అనంతగౌతమ్

నంద్యాల/ఆళ్లగడ్డ, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులు మృతి చెందగా.. మరో 27 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఒక్కసారిగా రెండు బస్సుల్లో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. దీంతో వెంటనే తోటి ప్రయాణి కులు పోలీసులకు సమాచారమందించడంతో ఆళ్లగడ్డ పోలీసులు అక్కడి చేరుకుని వైద్యచికిత్సల నిమిత్తం ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బస్సుల్లో 49 మంది ప్రయాణికులు

శ్రీకృష్ణ ట్రావెల్స్ జగన్ ట్రావెల్స్‌కు చెందిన ఈ రెండు బస్సులు నిత్యం తిరుపతి- హైదరాబాదు రూట్‌లో తిరుగుతున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో గురువారం రాత్రి కూడా ఈ రెండు బస్సులు తిరుపతి నుంచి హైదరాబాదుకు వివిధ ప్రాంతాలకు చెందిన 49 మంది ప్రయాణికులతో బయల్దేరాయి. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో ఆల్ఫా ఇంజనీరింగ్ కళాశాల వద్దకు శుక్రవారం ఉదయం తెల్లవారు జామున 3.30 గంటలకు రాగానే.. ముందుగా వెళ్తున్న జగన్ ట్రావెల్స్ బస్సును వెనుకనుంచి వస్తున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో రెండు బస్సుల్లో ప్రయాణిస్తున్న 49 మంది ప్రయాణికుల్లో 27మందికి గాయాలు కాగా.. ముగ్గురు ప్రయాణికులకు తీవ్రరక్తస్రావం కావడంతో అక్కడిక్కడే మృతి చెందారు. ప్రయాణికులందరూ నిద్రలో ఉండటంతో ప్రమాదం ఎలా జరిగిగిందో..? కూడా చెప్పలేని పరిస్థితి. అయితే పోలీసులు మాత్రం డ్రైవర్ నిర్లక్ష్యంతోనే బస్సును ఢీకొట్టినట్లు ప్రాథమిక అంచన వేసినట్లు తెలుస్తోంది.

ముగ్గురి మృతి

ఈ ఘటనలో శ్రీకృష్ణ ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల్లో ఏపీలోని అనకాపల్లి జిల్లా నేతవరం మండలం గునుపుడి గ్రామానికి చెందిన కుసరాజు (25) మృతి చెందారు. ఆయన హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కంపెనీలో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. అలాగే జగన్ ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్న రాజమండ్రి పట్టణానికి చెందిన వెంకటసాయి(22) మృతి చెందారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా బీరంగూడలో ఉంటున్నారు. హైదరాబాదులోని సరూర్‌నగర్‌కు చెందిన అనంత గౌతమ్(23) అక్కడికక్కడే మృతి చెందారు. రెండు బస్సుల్లోని 27మంది గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. అయితే మృతిచెందిన వారిలో వెంకటసాయి, అనంతగౌతమ్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారని పోలీసులు తెలిపారు. మృతులు ముగ్గురితో పాటు మిగిలిన ప్రయాణికుల్లో కూడా ఎక్కువ శాతం మంది తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తిరుగు పయనమైనట్లు సమాచారం.



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సులు

నాటక రంగం మరింత విస్తరించాలి

- కర్నూలు కళాకారుల ప్రదర్శనలు ఢిల్లీలో ఏర్పాటు చేయిస్తా
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- టీజీవీ కళాక్షేత్రంలో 'సై సైరా నరసింహారెడ్డి' నాటక ప్రదర్శన



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటక కళాకారులతో మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఆధునిక కాలంలో నాటక రంగం మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం రాత్రి జిల్లాకు చెందిన తొలితరం స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రను తెలిపే 'సై సైరా నరసింహారెడ్డి' చారిత్రక నాటకం ప్రదర్శించారు. టీజీవీ కళాక్షేత్రం కళాకారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ నాటక ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా మంత్రి టీజీ భరత్ విచ్చేసి ప్రారంభించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు కళాకారుల ప్రదర్శనలు ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లి అక్కడ ప్రదర్శనలకు కృషిచేస్తానని అన్నారు. జిల్లాలో రంగస్థల కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు టీజీవీ కళాక్షేత్రం ద్వారా తన దృష్టికి తెస్తే సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పారిశ్రామికవేత్త టీవీ రెడ్డి మాట్లాడుతూ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్ర మనకు ఆదర్శమన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ దివంగత మాజీ ఎమ్మెల్యే బుడ్డా వెంగళరెడ్డి నరసింహారెడ్డి చరిత్రను నాటకరూపంలో తీసుకువచ్చేందుకు కృషి చేశారని, టీజీవీ కళాక్షేత్రం ఈనాటకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శిస్తోందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ సై సైరా నరసింహారెడ్డి నాటకంలోని కళాకారులను సత్కరించారు. ఇటీవల నూతనంగా ఏర్పడిన టీజీవీ కళాక్షేత్రం కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి యాగంటీశ్వరప్ప, కళాకారులు కేవీ రమణ, జీవీ శ్రీనివాసరెడ్డి, పి. రాజారత్నం, మహమ్మద్ మియా పాల్గొన్నారు.



నాటకంలోని ఓ దృశ్యం

అలరించిన 'సై సైరా నరసింహారెడ్డి నాటకం...

జిల్లా తొలితరం స్వాతంత్ర్య పోరాట యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రను తెలియజేసే 'సై సైరా నరసింహారెడ్డి' చారిత్రక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. బ్రిటీష దొరలపై నరసింహారెడ్డి సాగించిన పోరాటాలను కళ్లకు కట్టేలా, సురభి సెట్టింగులతో ఈనాటక ప్రదర్శన సాగింది. దివంగత నాటక రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్ రాసిన ఈనాటకానికి కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య దర్శకత్వం వహించారు. ఇందులో జీవీ శ్రీనివాసరెడ్డి, చల్లా నవీన్‌కుమార్‌చౌదరి, మహమ్మద్‌మియా, ఆర్.శ్యామ్యూల్, గాండ్ల లక్ష్మన్న, బాలవెంకటేశ్వర్లు, పి. రాజారత్నం, సంగా ఆంజనేయులు, పి.భాస్కర్, సురభి ప్రభావతి, హసీనా జాన్ వివిధ పాత్రల్లో ప్రేక్షకులను మెప్పించారు.

నేడు శ్రీకృష్ణాష్టమి



కర్నూలు కల్చరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ భగవానుడి జన్మదిన వేడుక 'శ్రీకృష్ణ జన్మాష్టమి'ని శనివారం ఉమ్మడి జిల్లాలోని శైవ భక్తులు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక, మహిళా సంస్థల ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమాలు, శ్రీకృష్ణ, గోపిక, రాధ వేషధారణ పోటీలు, సాంస్కృతిక పోటీలు ఏర్పాటు చేశారు. కర్నూలు నగరంలో నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని శ్రీకృష్ణ మందిరంలో, కిడ్స్ వరల్డ్ ఎదురుగా ఉన్న ఇస్కాన్ ధ్యాన కేంద్రంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ పాఠశాలల్లో, భరత మాత మాతృమండలి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నారు.

సేవకు ప్రశంసా పత్రం

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో విశిష్ట సేవలు అందిస్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు హెడ్ మదన్‌మోహన్‌కు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జిల్లా రాజకుమారి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో బాలికల కోసం మరుగుదొడ్ల నిర్మాణం, ట్రక్ డ్రైవర్‌లకు ఆరోగ్యశిబిరాలు, రహదారి బద్రతా కార్యక్రమాలు వంటి సమాజహిత చర్యలకు ప్రశంసాపత్రం పొందారు.



ప్రశంసా పత్రాన్ని అందు కుంటున్న ఆర్‌ఈపీఎల్ ప్రాజెక్టు హెడ్ మదన్ మోహన్

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

బనగానపల్లె, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రైప గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలి పారు. వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి (35) అనే రైతుకు మూడెకరాల పొలం ఉంది. మరో ఇరవై ఐదు ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. కౌలుకు తీసుకున్న పొలంలో మిరప పంట వేసి రూ.30లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక మానసిక వేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది తనసొంత పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైతుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైకు అదుపుతప్పి ఒకరి మృతి

కర్నూలు క్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నటేకూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్డెరాజు (31) అనే వ్యక్తి మృతిచెందాడు. కోడుమూరు మండలం ప్యాలకుర్తికి చెందిన వడ్డె రాజు తన భార్య దుర్గ, సోదరితో కలిసి మోటారు సైకిల్‌పైన కల్లూరు మండలం తడకనపల్లెలో శుభకార్యానికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి ముగ్గురు వెళ్తుండగా.. బైక్ అదుపు తప్పి చిన్నటేకూరు వంతెన వద్ద రెయిలింగ్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు అక్కకడడిక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కుచట్టం ప్రజలకు వజ్రాయుధం లాంటిదని డీసీవో రామాంజనేయులు అన్నారు. శుక్రవారం జిల్లా సహకార అధికారి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల నుంచి తగిన సమాచారం పొందేందుకు సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు ఈచట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా సహకార సిబ్బంది సమాచార హక్కు చట్టంపై నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు.

మహానందిలో భక్తులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు


ఆలయం ముందు నిలిపిన వాహనాలు

మహానంది, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మహానందిలో భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా సెలవులు రావడంతో మహానందిలో భక్తుల రద్దీ పెరిగిపోయింది. దీంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తుల వాహనాలు ప్రధాన ఆలయం ముందు ఉన్న ప్రధాన నంది సర్కిల్ నిలపడంతో సాదరణ భక్తులు దైవదర్శనం కోసం వెళ్ళేందుకు ఇబ్బందులు పడ్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ రహదారిపై వాహనాలు నిలపడంతో ట్రాపిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా ఆలయ అధికారులు, పోలీసులు చొరవచూపి వాహనాల పార్కింగ్ వెళ్ళేందుకు సిబ్బందిని నియమించి భక్తులకు ట్రాపిక్ కష్టాల నుండి విముక్తి కల్పించాలని కోరారు.

గ్రానైట్ షాపులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



నందికొట్కూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఓ గ్రానైట్ దుకాణంలోకి దూసుకెళ్లింది. శుక్రవారం ఉదయం 5 గంటలకు బెంగళూరులో బయలు దేరిన బస్సు మధ్యాహ్నం 3.30గంటలకు నందికొట్కూరుకు చేరాల్సి ఉంది. మరో రెండు మూడు నిమిషాల్లో డిపోకు చేరే సమయంలో డ్రైవర్ కరీముల్లాకు బీపీ తగ్గి కళ్లు తిరగడంతో బస్సు అదుపుతప్పి పట్టణ శివారులోని మైహోమ్ గ్రానైట్ షాపులోకి దూసుకెళ్లింది. షాపులో ఎవరూ లేకపోవడంతో పాటు బస్సులో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే గ్రానైట్ బండలు పగలడంతో రూ.లక్షల్లో ఆస్థి నష్టంతో పాటు ఆర్టీసీ బస్సు కూడా ధ్వంసమైంది.

'భవనాశి'కి తగ్గిన వరద ఉధృతి

ఆత్మకూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): భవనాశి నదికి శుక్రవారం వరద ఉధృతి తగ్గింది. ఆత్మకూరు నుంచి కురుకుంద, కొట్టాల చెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు రాక పోకలు సాగుతున్నాయి. ఇదిలా ఉంటే పంట పొలాల్లో నిలిచిన నీటిని కూడా రైతులు బయటకు పంపించే ప్రయత్నం చేశారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ నాయుడు

నందికొట్కూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభోత్సవం సందర్భంగా చంద్రబాబు చిత్రపటానికి నందికొట్కూరు ఆర్‌టీసీ డిపో వద్ద మహిళలు పాలాభిషేకం చేశారు. శుక్రవారం రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ నాయుడు ఆధ్వర్యంలో మహిళలు కృతజ్ఞతగా చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం మహేష్ నాయుడు బస్సులో ప్రయాణం చేస్తున్న మహిళలకు పసుపుకుం కుమ కింద జాకెట్‌లను అందజేసి మహిళల పట్ల తమ పార్టీకి ఉన్న గౌర వాన్ని చాటుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీలకు మొదటి నుం చి టీడీపీలో సమాజంలో గౌరవం, ఆర్థిక స్వాలంభన లభిస్తోందన్నారు. మహిళలకు పెద్దపీట వేసే ప్రధాన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని ఆయన అన్నారు. టీడీపీ నాయకులు శివానందరెడ్డి, మధు, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగం చిరస్మరణీయం

- ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు
- రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

భారత సైనికుల త్యాగం చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దిన వేడుకలు నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ పతాకం ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద మువ్వన్నెల జెండా రెపరెపలాడింది.
- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


నంద్యాల హాస్పిటల్: మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ


కొత్తపల్లి : కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల పిరమిడ్ ప్రదర్శన


నంద్యాల కల్చరల్: పచ్చని పొలాల్లో మువ్వన్నెల జెండాలతో చిన్నారులు


సేవా పతకాన్ని అందుకుంటున్న కానిస్టేబుల్ నాగశేషులు


బండిఆత్మకూరు: ఏపీవో వసుధకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డ్వామా పీడీ సూర్యనారాయణ


పాణ్యం: జాతీయ జెండాను ఎగురవేస్తున్న చైర్మన్ శాంతిరాముడు



నందికొట్కూరు: జెండాను ఎగురవేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి


గోస్పాడు: తేళ్లపురిలో..


పగిడ్యాల: జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య


నందికొట్కూరు రూరల్: జాతీయ జెండాను ఎగురవేస్తున్న అధికారులు




జూపాడుబంగ్లా: పారుమంచాల మదరసా వద్ద జెండాను ఎగురవేసిన దృశ్యం.. పాములపాడు: తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య వేడుకలు


ఆత్మకూరు రూరల్ : సచివాలయం వద్ద జెండాను ఎగుర వేస్తున్న సర్పంచ్

ఉత్తమ అధికారిగా మహానంది ఆలయ ఈవో


ప్రశాంస పత్రాన్ని అందుకుంటున్న ఈవో

మహానంది, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మహానంది దేవస్థానం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి ఉత్తమ అధికారిగా అవార్డును లభించింది. ఈమేరకు శుక్రవారం నంద్యాల్లో జరిగిన 79వ గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టర్ రాజకుమారి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ఈవో ప్రశాంస పత్రం అందుకొన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్న శ్రీనివాసరెడ్డికి ఉత్తమ అధికారిగా ప్రభుత్వం గుర్తించడంపై ఆలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేసారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గడివేముల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గని గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గని గ్రామానికి చెందిన ఈశ్వర్ (26) సోలార్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించేవాడు. విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలయ్యాడు.చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు.

అలరించిన భూకైలాస్ హరికథా గానం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో శుక్రవారం స్వామి అమ్మవార్లకు వైభవంగా లోక కళ్యాణార్థం ఊయల సేవను నిర్వహించారు. అమ్మవారికి లక్షకుంకుమార్చన కార్యక్రమంతో పాటు సాయంత్రం లోకకళ్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తూ స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా, షోడషోపచార పూజ, ఊయలసేవ నిర్వహించారు.

జాతీయ జెండాకు అవమానం


గడివేముల సచివాలయంలో కింద పడ్డ జాతీయ జెండా

గడివేముల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ జెండాకు అవమానం జరిగిన ఘటన మండల కేంద్రంలోని గడివేముల సచివాలయం వద్ద చోటుచేసుకుంది. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతకాన్ని సర్పంచ్, పంచాయతీ సిబ్బంది ఎగురవేశారు. వేడుకల అనంతరం సిబ్బంది ఇంటికి వెళ్లారు. వారంతా వెళ్లిన గంటలోపే జాతీయ జెండా నేలమీద పడిపోయింది. స్థానికులు జాతీయ జెండా నేలపై పడి ఉన్న విషయాన్ని ఎంపీడీవో వాసుదేవగుప్త దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పంచాయతీ సిబ్బందిని కార్యాలయానికి పంపించి జాతీయ జెండాను ఎగురవేయించారు. స్వాతంత్ర దినోత్సవం రోజు అందరూ సంబరాలు జరుపుకుంటే సచివాలయ వద్ద జాతీయ జెండాకు అవమానం జరగడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత జెండా కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహనీయుల త్యాగాలు మరువలేనివి : ఎస్పీ


పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల టౌన్, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): మహనీయుల త్యాగాలు మరువలేనివని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎస్పీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను గుర్తు చేసుకుని వారి త్యాగాలకు అనుగుణంగా ప్రతిఒక్కరు పనిచేయాలని సూచించారు. పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి సేవ పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు యుగంధర్‌బాబు, మందా జావళి, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంద పాల్గొన్నారు.

నేడు మావోయిస్టు నేత నాగన్న మృతదేహానికి అంత్యక్రియలు

ఆత్మకూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని చౌకీ జిల్లాలో గల రాజ్‌నంద్ గావ్ - కాంగేర్ సరిహద్దులో రెండు రోజుల క్రితం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు నేత, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా సుగులూరు చిన్నన్న అలియాస్ నాగన్న, అలియాస్ విజయ్, అలియాస్ శంకర్ మృతదేహానికి శనివారం ఆయన స్వగ్రామమైన ఆత్మకూరు మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో అంత్యక్రియలు జరగనున్నాయి. గురువారం ఆయన కుమారుడు క్రాంతి కుమార్‌తో పాటు మరికొంత మంది రాజ్‌నంద్‌గావుకు బయలు దేరారు. పోస్టుమార్టం పూర్తవ్వడంతో ఆయన మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం 4.30గంటల సమయంలో అంబులెన్స్‌లో బయలుదేరారు. శనివారం ఉదయం 10గంటల సమయానికి చిన్నన్న మృతదేహం వడ్లరామాపురం గ్రామానికి చేరుకునే అవకాశం ఉంది. అంత్యక్రియలను వారి సొంత పొలంలోనే చేయాలని భావిస్తున్నప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలతో పొలంలో నీరు నిలిచిపోవడం వల్ల కొంత సమస్య నెలకొన్నట్లు తెలిసింది.

కనువిందు చేసిన హరివిల్లు


పాణ్యంలో శుక్రవారం హరివిల్లు కనువిందు చేసింది. సాయంత్రం ఎండలో చిరుజల్లు పడుతుండగా ఆకాశంలో రంగుల హరివిల్లు గ్రామ ప్రజలను కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.
● పాణ్యం, ఆంధ్రజ్యోతి

మహిళలకు వరం 'స్త్రీ శక్తి'

- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం


నంద్యాల టౌన్ : ఆర్టీసీ సిబ్బందితో కలిసి బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం


ఆత్మకూరులో ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం


నందికొట్కూరు: మహిళలతో కలిసి ప్రయాణం చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నంద్యాల టౌన్, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): మహిళలకు వరం 'స్త్రీ శక్తి' పథకం అని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా కేంద్రంలో ఉచిత బస్సు ప్రయాణాన్ని మంత్రి ప్రారంభించారు. ఆర్‌ఎం రజియా సుల్తానా మంత్రికి, కలెక్టర్ రాజకుమారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నెరవేర్చిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మహిళ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను ఉపయోగించుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్ర మంలో జేసీ విష్ణు చరణ్, జిల్లా టీడీపీ యువ నాయకుడు ఎన్‌ఎండీ ఫిరోజ్ ఆర్టీసీ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం

ఉచితంగా ప్రయాణించే బస్సుల్లో కండెక్టర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చామని నంద్యాల ఆర్‌ఎం రజియా సుల్తానా అన్నారు. అలాగే మొత్తం ఏడు డిపోల్లో 452 బస్సులు ఉండగా వాటిలో 373 బస్సులను ఉచిత ప్రయాణానికి కేటాయించామని వివరించారు.

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించుకున్న సూపర్ సిక్స్ హామీల్లో భాగమైన స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ప్రయోజనకరంగా నిలుస్తుందని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ డిపో నందు స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళల ఆత్మగౌరవాన్ని పెంచడంతో పాటు ఆర్థికాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతోందని అన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకుని జీవన ప్రమాణాలను మరింత మెరుగుపర్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షుడు రవీంద్రబాబు, వేణుగోపాల్, శ్రీశైలం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ మోమిన్ షబాన, జనసేన పార్టీ జిల్లా నాయకులు కర్నాటి శ్రీరాములు మాట్లాడారు.

నందికొట్కూరు: ఐదు రకాల బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. నందికొట్కూరులో ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే గిత్తా జయసూర్య స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మహిళలకు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. నందికొ ట్కూరు నుంచి కర్నూలు, నంద్యాలకు వెళ్లే బస్సులను ప్రారంభించి మహిళలకు ఉచిత టిక్కెట్లు అందజేశారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, నందికొట్కూరు సింగిల్ విండో చైర్మన్ ముర్తుజావలి, టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, టీడీపీ నాయకులు, బీజేపీ నాయకులు దామోదర్‌రెడ్డి, జనసేన నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మట్టి విగ్రహాలతోనే వేడుకలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మట్టి విగ్రహాలతోనే గణేశ్ వేడుకలు జరుపుకోవాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో గణేశ్ ఉత్సవాల సలహాదారు టంగుటూరు శ్రీనయ్య , అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి బీసీ మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం కార్యక్రమాలు అన్ని శాఖల అధికారులు సమష్టి కృషితో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథరెడ్డి, ఎస్ఐ దుగ్గిరెడ్డి నందివర్గం ఎస్ఐ వెంకట సుబ్బయ్య. ఉత్సవ కమిటీ సభ్యులు వంగల పరమేశ్వరరెడ్డి, బండి మౌళీశ్వరరెడ్డి, అమరనాథరెడ్డి, మదన్‌భూపాల్‌రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, నాగేంద్రారెడ్డి, కోడి నగేశ్, ఎంపీడీవో రాధిక, తహసీల్దారు నారాయణరెడ్డి, ఈవో సతీశ్‌రెడ్డి, ఏఈ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అడవుల సంరక్షణకు కృషి: రేంజర్



ముర్తుజావలి

రుద్రవరం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణకు కృషి చేస్తానని రుద్రవరం ఫారెస్టు రేంజర్ ముర్తుజావలి అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రేంజర్ శ్రీపతినాయుడు అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు. డిప్యూటీ రేంజర్‌గా పనిచేస్తున్న ముర్తుజావలికి ఫారెస్టు ఉన్నతాధికారులు రేంజర్‌గా పదోన్నతి కల్పించారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

డోన్ రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే లక్ష్యమని కమలాపురం గ్రామ సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కమలాపురం గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ సమస్యలుపై సర్పంచ్ సచివాలయ సిబ్బందితో చర్చించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు పూర్తి చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా శ్రావణమాస పూజలు

చాగలమర్రి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని సత్యమ్మ దేవత ఆలయంలో శ్రావణమాస పూజలను శుక్రవారం రజక సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

శిరివెళ్ల, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు ఎస్సీ కాలనీలోని కోదండ రామాలయంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం నిర్వహించారు. మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు.

'పది' ప్రతిభావంతులకు బంగారు పతకాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పది ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు కొలిమిగుండ్లకు చెందిన దాత పూట్లూరు రంగనాథరెడ్డి శుక్రవారం బంగారు పతకాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్‌కలాం, ఎస్‌వో లక్ష్మీసరోజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బడి బస్సు ప్రారంభం

కొలిమిగుండ్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి చొరవతో విద్యార్థులకు బడి బస్సు ప్రారంభమైంది. మండలంలోని బందార్లపల్లె గ్రామం నుంచి సుమారు 70మంది విద్యార్థులు చెక్‌పోస్టు వద్దనున్న ఉన్నత పాఠశాలకు, తాడిపత్రికి ప్రతి రోజూ వెళ్లి వస్తుంటారు. అయితే బస్సులు లేకపోవడంతో తీవ్ర కష్టాలు పడుతున్నారు. దీంతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని తాడిపత్రి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు ఏర్పాటుచేశారు. శుక్రవారం బస్సు బందార్లపల్లెకు రావడంతో టీడీపీ నాయకులు కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పూజలు నిర్వహించారు. సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సింగిల్‌విండో అధ్యక్షుడిగా దస్తగిరిరెడ్డి

ఉయ్యాలవాడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడుగా బోరెడ్డి దస్తగిరిరెడ్డి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో మౌలాలి, డైరెక్టర్లు సింగిరెడ్డి, ఎగ్గోని రఘునాథరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డి శేఖర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, బోరెడ్డి నర్సిరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రైల్వేలైన్ కాపర్ వైర్ చోరీ

కొలిమిగుండ్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జాపురం గ్రామ పరిధిలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు సంబంధించిన రైల్వేలైన్ కాపర్ వైర్ చోరీకి గురైనట్లు సీఐ రమేష్‌బాబు శుక్రవారం వెల్లడించారు. సంజామల నుంచి రామ్‌కో సిమెంటు వరకు నూతన రైల్వేలైన్ నిర్మాణం చేపడుతున్నారు. అయితే గత నెల 15న రాత్రి గుర్తు తెలియని దుండగులు రూ.8లక్షలు విలువ చేసే 306మీటర్ల కాపర్ వైరు ఎత్తుకెళ్లినట్లు కంపెనీ సూపర్‌వైజరు ముక్కా వెంకటనాథరెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పంద్రాగస్టు పట్టదా?



డోన్ అర్బన్‌హెల్త్ సెంటర్‌కు వేసిన తాళం

డోన్ టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందికి పంద్రాగస్టు పట్టదా అని పలువురు చర్చించుకున్నారు. స్వాతంత్ర్య దిన వేడుకల రోజున మువ్వన్నెల జెండాను ఎగురవేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వైద్యశాలకు తాళం తీయకపోవడంతో రోగులు ఇబ్బంది పడ్డారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రోగులు కోరారు.

చాగలమర్రి గ్రామంలో..

చాగలమర్రి: మండల కేంద్రంలోని 24 గంటల ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వైద్యులు శుక్రవారం 79వ స్వాతంత్ర్య దిన వేడుకలకు గైర్హాజరయ్యారు. దాంతో సీహెచ్‌వో రమణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దిన వేడుకలను నిర్వహించారు. వైద్యులు గైర్హాజరు విషయం గురించి సూపర్‌వైజర్ రామలింగారెడ్డిని వివరణ కోరగా తమకు తెలియదని అన్నారు. వైద్యులు రాకపోవడంతో తామే జెండా వందనం చేశామన్నారు.

అమరవీరులను స్మరించుకోవాలి

- పలువురు వక్తల పిలుపు
- జాతీయ జెండా ఎగురవేత
- ఘనంగా స్వాతంత్ర్య దిన వేడుకలు

దేశానికి స్వాతంత్ర్యం అందించిన ఎందరో అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజకవర్గాల పరిధిలోని మండలాలు, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వ హించారు. డోన్‌లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ,ఆళ్లగడ్డలో భూమా అఖిల ప్రియ, ప్రజాప్రతినిధులు, న్యాయాధికారులు, అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనాన్ని స్వీకరించారు. మహోన్నత వ్యక్తుల త్యాగాలను గుర్తుపెట్టుకోవాలన్నారు.

● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్




సంజామల, అవుకులో విద్యార్థుల విన్యాసాలు



ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



బనగానపల్లె ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



డోన్ ఎంఎస్ఆర్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసిన ధర్మవరం సుబ్బారెడ్డి



డోన్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల, నాయకులు, అధికారులు



కొలిమిగుండ్ల: స్వాతంత్ర్య దిన వేడుకల్లో పాల్గొన్న సీఐ రమేష్‌బాబు, ఎస్ గోపాల్, పోలీసులు



కొలిమిగుండ్ల: మసీదు వద్ద స్వాతంత్ర్య దిన వేడుకల్లో ముస్లింలు



కొలిమిగుండ్ల: టీడీపీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న మూలే రామేశ్వరరెడ్డి



చాగలమర్రిలో..



బేతంచెర్లలో..



దొర్నిపాడులో..



శిరివెళ్లలో..



డోన్ మండలం వెంకటనాయునిపల్లెలో..



చాగలమర్రిలో..



సంజామలలో..



కోవెలకుంట్లలో..



ప్యాపిలిలో..



ఉయ్యాలవాడలో..



రుద్రవరంలో..





అవుకులో..

టీడీపీతోనే మహిళల శ్రేయస్సు

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి
- జెండా ఊపి 'స్త్రీ శక్తి'ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

డోన్ టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమం, శ్రేయస్సు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటైన స్త్రీశక్తి పథకాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోట్ల శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల్లో దాదాపు అన్ని హామీలను పూర్తి చేశామన్నారు. అనంతరం మహిళల ఉచిత బస్సును ప్రారంభించారు. ఎమ్మెల్యే కండక్టర్‌గా టికెట్‌ను మహిళలకు అందజేశారు. అనంతరం డిపో నుంచి ఎల్ఐసీ ఆఫీసు, శ్రీరామ థియేటర్, పాతబస్టాండు మీదుగా బస్సులో ప్రయాణించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణంలో స్త్రీశక్తి ఉచిత సర్వీసు బస్సులను డోన్ ఆర్డీవో నరసింహులు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఏదైనా గుర్తింపు కార్డు చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించొచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు నారాయణరెడ్డి, డిపో మేనేజర్ కిశోర్‌కుమార్, ఆర్టీసీ కంట్రోలర్ వెంకటన్న, ఆర్టీసీ సిబ్బంది, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: స్త్రీశక్తి పథకం మహిళలకు వరమని కోవెలకుంట్ల తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో డీఎం జీవీ నాగరాజు ఆధ్వర్యంలో ఉచిత బస్సు పథకాన్ని తహసీల్దారు ప్రారంభించారు.



డోన్‌లో మహిళల ఉచిత బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ఆళ్లగడ్డ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీశక్తి పథకాన్ని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సు ఎక్కి కండెక్టర్ వద్ద ఫ్రీ టికెట్ తీసుకొని ప్రయాణించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆళ్లగడ్డ డిపోలో 67 ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణానికి కేటాయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ ఈ పథకాన్ని ప్రారంభించార న్నారు. చాలా చోట్ల స్కూల్ పిల్లలకు బస్సులు తక్కువగా ఉన్నాయని త్వరలో వాటిని కొత్త సర్వీసులు తీసుకొని సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఆర్టీసీ అధికారులు , టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



బనగానపల్లె ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తున్న డోన్ ఆర్డీవో నరసింహులు



కోవెలకుంట్లలో బస్సును ప్రారంభిస్తున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

విద్యార్థులను ప్రోత్సహించడం హర్షనీయం

అవుకు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను టీడీపీ సీనియర్ నాయకుడు గూడాల మురళీధరరెడ్డి ప్రోత్సహించటం హర్షనీయమని కునుకుంట్ల, అవుకు బాలుర ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్యామల, సుబ్బయ్య అన్నారు. కునుకుంట్ల గ్రామానికి చెందిన మురళీధరరెడ్డి తన తల్లి కీ.శే నాగలక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఆయా పాఠశాలల్లో పదవతరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు రాజభూపాల్ (కునుకుంట్ల), ఆనంద్ (అవుకు)కు ఒక్కొక్కరికీ రూ. 5వేలు నగదును శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అందించారు. మురళీధరరెడ్డికి పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.



కునుకుంట్లలో విద్యార్థికి నగదు అందిస్తున్న హెచ్ఎం శ్యామల

కృష్ణాష్టమి పూజలు ప్రారంభం



హరివరం సమీపంలో ముస్తాబైన ఇస్కాన్ టెంపుల్

రుద్రవరం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరినగరం సమీపంలో ఉన్న ఇస్కాన్ అహోబిళం టెంపుల్‌లో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. టెంపుల్ మేనేజర్ చంద్రకేశవదాస్ మాట్లాడుతూ ఇస్కాన్ అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఆధ్వర్యంలో భగవద్గీతను ప్రపంచ వ్యాప్తి చేస్తున్నట్లు తెలిపారు. వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

కృష్ణాష్టమి వేడుకలు జయప్రదం చేయాలి

కొలిమిగుండ్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలను జయప్రదం చేయాలని ఆసంస్థ ప్రతినిధులు మీర్జాపురం రామకృష్ణారెడ్డి, పీఎంహెచ్ నాయుడు, బాబు, బాలు కోరారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, స్థానిక ఎస్ఐ గోపాల్, పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో భూపాల్, మాధవ, హరి తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె

కొలిమిగుండ్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మదనంతపురం గ్రామంలో శుక్రవారం మట్టిమిద్దె కూలింది. గ్రామంలోని ఈబీసీకాలనీలో పూట్లూరు మల్లేశ్వరరెడ్డి మట్టి మిద్దెలో నివాసం ఉంటున్నారు. ఇంటిలో సామగ్రి భద్రపరిచే గది పైకప్పు కూలిపోయింది. అ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గదిలోని సామాన్లు దెబ్బతిన్నాయి.

కిడ్నాప్ కేసులో ఐదుగురికి జైలు

రుద్రవరం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఓ యువతిని కిడ్నాప్ చేసిన కేసులో ఐదుగురికి జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ మహ్మద్‌రఫీ శుక్రవారం తెలిపారు. వివరాలు.. ఈ నెల 12న ఓ యువతి అదృశ్యమైనట్లు తండ్రి ఫిర్యాదు చేయగా కేసుగా నమోదు చేశామన్నారు. పోలీసులు యువతిని గుర్తించి విచారించగా తనను ఐదుగురు కిడ్నాప్ చేశారని తెలిపింది. దాంతో ఐదుగురిని గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ న్యాయాధికారి ఎదుట లక్ష్మీనరసింహ, పవన్‌కుమార్, నవీన్, సునీల్, హుసేన్‌బాషా ను హాజరుపరుచగా రిమాండ్‌కు ఆదేశించారు. దాంతో నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.